సాక్షి ప్రకాశం

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



ధరల విలయం

మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు భగ్గుమం టున్నాయి. వంటనూనెలతో పాటు ఇతర నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో జనం అల్లాడుతున్నారు.

- 8లో..



గంజాయి అంతు చూడాల్సిందే

గంజాయి విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

26/19

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

21, 22న హెడ్‌మాస్టర్స్ అకౌంట్ టెస్ట్

ఒంగోలు సిటీ: డిసెంబరు 21, 22వ తేదీల్లో విజయవాడలోని గాంధీజీ మునిసిపల్ హైస్కూల్లో హెడ్‌మాస్టర్స్ అకౌంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ కోరారు.

రేపు ఫెన్సింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఫెన్సింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 19న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు 18 సంవత్సరాల్లోపు వారు మాత్రమే హాజరుకావాలి. హాజరయ్యేవారు తప్పనిసరిగా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు తప్పక వెంట తీసుకురావాలి. వీటితోపాటు గతంలో ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్ కూడా తీసుకుని రావాలని కోరారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 21 నుంచి 23 వరకు విజయవాడలోని ఐజీ మున్సిపల్ స్టేడియంలో డీఎస్ఏ హాలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు సెల్ నం: 7671991147ను సంప్రదించాలని నవీన్ కోరారు.

20న ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ చెస్ పోటీలు

ఒంగోలు: స్థానిక హైదరీక్లబ్‌లో ఈనెల 20న ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్కె నబీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఓపెన్, ఉమెన్ విభాగాల్లో జరుగుతాయి. ఆసక్తిగల వారు పూర్తి వివరాల కోసం 9666725719ను సంప్రదించాలన్నారు.

జేఎన్‌టీయూకే మహిళా బాస్కెట్ బాల్ జట్టుకు మంజు




ఎంపికైన విద్యార్థిని బండి మంజును అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ ఏ.వి.భాస్కరరావు

ఒంగోలు సిటీ: కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరిగే మహిళా బాస్కెట్ బాల్ పోటీల్లో జేఎన్‌టీయూకే తరఫున ఆడే 12 మంది టీంలో ఒంగోలు రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్‌నకు చెందిన విద్యార్థిని బండి మంజు ఎంపికైనట్లు కళాశాలల సెక్రటరీ శిద్దా హనుమంతరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఏ.వి.భాస్కరరావు మాట్లాడుతూ యూనివర్సిటీ తరఫున ఆడేందుకు ప్రతిభ గల 12 మంది సభ్యుల్లో రైజ్ కళాశాలకు చెందిన ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థిని బండి మంజు ఉండటం హర్షదాయకమన్నారు. ఎంపికైన విద్యార్థినికి ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. ఎంపికైన జట్టు ఈ నెల 20 వ తేది నుంచి 24 తేది వరకు జరిగే పోటీలలో ఆడతారని ఫిజికల్ డైరెక్టర్ ఎస్.హిమచంద్రబాబు, ఎస్.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థిని కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నారు, రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక అభినందించారు.

బిల్లుల భారం దించండి

- కరెంటు బిల్లులను దహనం చేసిన సీపీఎం



కరెంటు బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: భారీగా పెంచిన విద్యుత్ బిల్లులకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. ట్రూఅప్ చార్జీలు, సర్‌చార్జీల పేరుతో బిల్లులు పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు కరెంటు బిల్లులను దహనం చేశారు. మంగళవారం నగరంలోని 60 అడుగుల రోడ్డు జంక్షన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ.. ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్లను ప్రజలపై మోపడం దారుణమన్నారు. ఇంతపెద్ద మొత్తంలో ప్రజలపై భారం వేయడం చరిత్రలో ఎప్పుడూ జరగలేదని చెప్పారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలను పెంచమంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు గెలిచి గద్దెనెక్కిన తరువాత దొడ్డిదారిలో ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం మోసం చేయడమేనని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాలకొండయ్య, జి.ఆదిలక్ష్మి, బాలకృష్ణ, ఆదినారాయణ, పాపని సుబ్బారావు పాల్గొన్నారు.

కొండను మింగిన అనకొండ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ప్రకృతి వనరులను చెరబట్టిన పచ్చమూకలు కోట్లు కొల్లగొడుతున్నారు. కొండలు సైతం పిండిచేసి జేబులు నింపుకుంటున్నారు. దర్శి నియోజకవర్గ టీడీపీ నేత కనుసన్నల్లో ఇసుక, మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగిపోతోంది. ఏకంగా కొర్రపాటివారిపాలెం కొండనే తవ్వేసి అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. టీడీపీ నేతలు ధనదాహంతో తమ పొట్టకొడుతున్నారంటూ ఆ గ్రామస్తులు కన్నెర్ర చేశారు. ఊరంతా ఏకమై మట్టిమాఫియాకు వ్యతిరేకంగా నిరసన గళమెత్తారు.



రెండోవైపు తవ్విన కొండ

- మట్టి కోసం కొర్రపాటివారిపాలెం కొండను తవ్వేసిన పచ్చమూక
- కోట్ల రూపాయల విలువైన కొండమట్టి తరలింపు
- టీడీపీ నేత ధనదాహంతోనే అక్రమ తవ్వకాలని గ్రామస్తుల మండిపాటు
- అక్రమ మట్టి రవాణా నిలిపేయాలని ధర్నా
- మీ ధన దాహంతో మా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన

తాళ్లూరు: ఆ గ్రామస్తులకు ఆ ఊరిలో ఉన్న కొండే జీవనాధారం. 40 ఏళ్లుగా ఆ కొండను ఆధారంగా చేసుకుని జీవాలు, గేదెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ కొండపై టీడీపీ నాయకుల కన్ను పడింది. ఇంకేముంది కొండను పిండిచేసి మట్టి తరలించేశారు. తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెంలో ఉన్న మట్టి కొండను ఆరు నెలల్లోనే మొత్తం తవ్వి నేల మట్టం చేస్తున్నారు. గ్రామస్తులు తమ జీవనాధారం పోతుందని కాళ్లా వేళ్లాపడి వాపోయినా వినలేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా అడ్డుకోలేదు. ఎవరైనా అడ్డుకున్న వారి ఇంటికి నేరుగా పోలీసులనే పంపి వారి అంతు చూస్తామని బెదిరించి మట్టిని తరలించుకుని పోయారు. కొండవద్దకు వెళ్లి ఎవరైనా ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరించారు. అడ్డుకోవాల్సిన పోలీసులు అవినీతి పరులకు అండగా నిలిచారు. రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోకుండా వదిలేశారు. అద్దంకి నియోజకవర్గం మోదేపల్లి గ్రామానికి–దర్శి నియోజకవర్గం కొర్రపాటివారిపాలెంకు మధ్యలో ఈ కొండ ఉంది. దీంతో రెండు నియోజకవర్గాల అధికారులు మా పరిధిలో కాదంటే మా పరిధిలో లేదని చెప్పుకుంటున్నారు. కొండమట్టిని ఎటువంటి అనుమతులు లేకుండానే తోలుకుంటున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్న సామెతగా నియోజకవర్గ టీడీపీ నేత పెద్ద మొత్తంలో ముడుపులు పుచ్చుకుని కొండ మట్టి తోలుకోవడానికి అనుమతిస్తే గ్రామ, మండల స్థాయి టీడీపీ నాయకులు తమకు కూడా వాటాలు కావాలని తోలుకునే వారి వద్ద వసూళ్లు మొదలెట్టారు. దీంతో ఈ విషయం కాస్త రచ్చ రచ్చ అయింది. ప్రస్తుతం గ్రామస్తుల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. గ్రామంలో జీవాలు మేపుకునేందుకు ఎటు వెళ్లాలో తెలియక తమ జీవాలకు మేత ఎలా చేయాలో అర్థంకాని పరిస్థితుల్లో కొర్రపాటివారిపాలెం గ్రామస్తులు కొట్టుమిట్టాడుతున్నారు. చావో బతుకో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. వారిలో సహనం నశించి గ్రామస్తులందరూ కలసి కట్టుగా అక్రమార్కుల పై తిరగబడ్డారు. మంగళవారం పొక్లెయిన్‌లు, లారీలను నిలిపేసి ధర్నాకు కూర్చున్నారు. మా పైనించి వాహనాలు తీసుకుని వెళ్లి మా ప్రాణాలు తీసి ఇక్కడ నుంచి మట్టి తీసుకుని వెళ్లాలని భీష్మించుకుని కూర్చున్నారు. టీడీపీ నియోజకవర్గ నేత ధనదాహం తో తమ కొండ మట్టి మొత్తం తరలించుకుని పోతోందని తాము అడ్డు వస్తే పోలీసులను ఇంటికి పంపి బెదిరింపులకు గురి చేస్తోందని మండిపడ్డారు.



కొండ వద్ద మట్టి తవ్వుతున్న పొక్లెయిన్‌ను అడ్డుకుంటున్న మహిళలు

సామదాన భేద దండోపాయాలు

ఈ కొండ విషయంలో మండలంలో టీడీపీ నాయకుల మధ్య కమీషన్ల పోటీలు ఎక్కువయ్యాయి. దీంతో రంగంలోకి దిగిన గొట్టిపాటి లక్ష్మి అనుచరులు గుడి కట్టిస్తామని మట్టి విషయంలో అడ్డురావద్దని గ్రామస్తులను కోరారు. అయినా గ్రామస్తులు మాకు కొండే దేవుడు 40 ఏళ్లుగా కొండను నమ్ముకుని బతుకుతున్నాం. మేం మట్టి తోలనివ్వం అని నిర్మొహమాటంగా తెగేసి చెప్పారు. దీంతో మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి మట్టి తోలేది ఆపే సమస్యే లేదని పోలీసులను అడ్డు వచ్చిన వారిపై ప్రయోగించి యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నారు.

మా కొండను తరలించుపోతున్నారు



కొండ మట్టి తరలించుకుని పోతే మేం మా గేదెలు ఎలా మేపుకోవాలి. మా జీవనాధారం ఎలా సాగించాలి. మా ప్రాణాలు తీసిన తరువాత ఇక్కడ మట్టి తీసుకుని వెళ్లండి.

– కుమ్మరి శ్రీనివాసరావు, కొర్రపాటివారిపాలెం

ఇంటికి వచ్చి బెదిరిస్తున్నారు



మా ఇంటికి వచ్చి పోలీసులు బెదిరిస్తున్నారు. మాఅబ్బాయి ఎక్కడ అని అడిగారు. లేదు బెంగళూరు వెళ్లాడు అని చెప్పాం. మీ అబ్బాయి కొండమీద మట్టితోలుతున్నాడని ఫిర్యాదు చేశాడు... మీకు ఏం అడ్డం వచ్చింది కొండను తవ్వితే అని బెదిరించి వెళ్లారు.

– కురేటి వెంకాయమ్మ, కొర్రపాటివారిపాలెం

మా జీవనాధారం ఆ కొండే



అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికీ నిలిపివేయక పోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తాం.

– గోనెగుంట సుబ్బారావు, కొర్రపాటి వారి పాలెం

మా ప్రాణాలు తీసి అప్పుడు మట్టి తోలుకుని వెళ్లండి



40 ఏళ్లుగా ఈ కొండను నమ్ముకుని బతుకుతున్నాం. మా జీవనాధారం ఈ కొండే. ఎన్నిసార్లు కాళ్లు పట్టుకుని బతిమాలినా వినడం లేదు. అందుకే అందరం కలసి అడ్డుకుంటున్నాం. కొండను తవ్వుకుని వెళ్తే మా జీవనాధారానికి ఎవరు దారి చూపుతారు. ఎవరి పొలాల్లో మేం గేదెలు, మేకలు మేపుకోవాలి.

– పులిపాటి యోహాను

పార్టీని వీడడమంటే కన్న తల్లిని మార్చడమే

- వలంటీర్ వ్యవస్థ లేదు కానీ ఆ శాఖకు మంత్రి ఉన్నాడు
- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



జరుగుమల్లి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్‌సీపీ గుర్తు పై గెలిచి పదవులు అనుభవించి స్వార్థ రాజకీయాల కోసం పార్టీ మారడమంటే కన్నతల్లిని మార్చటమేనని ఇటీవల పార్టీ మారిన వారిపై వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరుగుమల్లి మండలానికి సంబంధించి పార్టీ నూతన కమిటీల నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ మండల పార్టీలో బలమైన నాయకత్వ నిర్మాణమే ధ్యేయంగా కృషి చేస్తానని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కొండపి గడ్డ పై పార్టీ జెండా ఎగురవేయటమే తన కర్తవ్యమని, ఆ ప్రకారం నూతన కమిటీలను నియమిస్తామని వివరించారు. కార్యకర్తలే పార్టీకి బలం, పునాది అని పునరుద్ఘాటించారు. కార్యకర్తల సమస్యలను అర్థం చేసుకున్న వాడే నాయకుడిగా ఎదుగుతాడన్నారు. పార్టీకి ప్రజాబలం బాగా ఉందని, కూటమి ప్రభుత్వం పై ఆరునెలలకే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చడానికి 2047 విజన్‌ను తెరపైకి తెచ్చారని ఈ విజన్ అమలు కావటానికి ఇంకా 23 సంవత్సరాల సమయం ఉందని అప్పటికి ఎవరు ఉంటారో ఎవరు పోతారో తెలియదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కూటమి నాయకులు డైవర్షన్ రాజకీయాలు మాని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవుపలికారు. రైతుభరోసా పథకానికి పేరు మార్చి అన్నదాత సుఖీభవ పేరు పెట్టారని, కానీ పథకం కింద ఇస్తానన్న రూ.20 వేలు మాత్రం ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలైనా ఒక్క హామీ నెరవేరలేదని మహిళలు, రైతులు, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఈనెల 27వ తేదీ విద్యుత్ చార్జీల పెంపుపై, జనవరి 3వ తేదీ విద్యార్థులకు బాసటగా జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేస్తామన్నారు.

వలంటీర్ వ్యవస్థ లేదు కానీ ఆ శాఖకు మంత్రి ఉన్నాడు:

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గ్రామ వలంటీర్లుకు జీతం రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ నేడు ఆ వ్యవస్థే లేదని సాక్షాత్తు అసెంబ్లీలో మంత్రి స్వామి ప్రకటించారని ఆదిమూలపు సురేష్ విమర్శించారు. వలంటీర్ వ్యవస్థ లేకపోతే లేని వ్యవస్థకు స్వామి మంత్రిగా ఎలాఉన్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో మంత్రులు జగన్ మోహన్‌రెడ్డిని అసెంబ్లీకి పిలిపించి తిట్టి పైశాచిక ఆనందం పొందేందుకు ఆరాటపడుతున్నారని, జగన్‌ను అవమానించటమే వారి లక్ష్యమని విమర్శించారు. గతంలో హరికృష్ణకు మంత్రి పదవి ఇచ్చి ఎమ్మెల్సీ ఇవ్వకుండా అతనే రాజీనామా చేసేలా చంద్రబాబు చక్రం తిప్పారని, త్వరలో జనసేన నాయకుడు నాగబాబు విషయంలోఅదే పునరావృతం అయినా ఆశ్చర్యం లేదన్నారు. నీచ రాజకీయాలు చేయటంలో చంద్రబాబును మించిన వారు లేరని మాజీ మంత్రి సురేష్ ఘాటుగా విమర్శించారు. ఈ సందర్భంగా పార్టీ పదవులు ఆశించే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలి

- ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



దగ్ధమైన పాకలను పరిశీలిస్తున్న చుండూరు రవిబాబు, కొమ్మూరి కనకారావు

ఒంగోలు సిటీ: పల్లెల్లో ప్రశాంత వాతావరణం ఉండాలే కానీ ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలు చేయకూడదని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. మంగళవారం దేవరంపాడు గ్రామానికి చెందిన కనుమూరి నాగేశ్వరరావు కు చెందిన పొగనారు మడుల వద్ద వేసిన రెండు పాకలను కొందరు దుండగులు ఆదివారం అర్థరాత్రి తగులబెట్టారు. ఈ సంఘటన జరిగిన ప్రాంతాన్ని చుండూరు రవిబాబు, ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఆరు నెలల్లోనే పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి వాగ్దానాలు చేసి అధికారంలో వచ్చిన వెంటనే ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకపోవడమే కాకుండా, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాజకీయంగా కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పరిపాలనను గాలికొదిలేసి ప్రతిపక్ష పార్టీని ఇబ్బందులు పెట్టడానికి మాత్రమే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వారిని బెదిరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కూడా కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆర్థికంగా దెబ్బతీయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటాననే ధైర్యాన్ని కార్యకర్తలకు ఇచ్చారు.

ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కరవది ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చుంచు రామకృష్ణ, నాయకులు కనుమూరి నాగరాజు, కనుమూరి రమేష్, కనుమూరి వెంకట రమణయ్య, కోటేశ్వరరావు, కె.బాలాంజనేయులు, కె.శ్రీను, కె.రవిబాబు, అయ్యపురెడ్డి, పులుసు సురేష్‌బాబు, కె.అంకయ్య, కోకు నాగరాజు,కె.సాయి ఉన్నారు.



సురక్షిత ప్రాంతానికి చేర్చుకున్న బోట్లు, వలలు



ఉధృతంగా ఎగిసి పడుతున్న అలలు

ఎగిసి పడుతున్న అలలు

- వలలు, బోట్లు సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- అప్రమత్తమైన మత్స్యకారులు

కొత్తపట్నం: తుఫాన్ కారణంగా ముందు జాగ్రత్తగా మత్స్యకారులు వలలు, బోట్లు, ఇంజన్లను సురక్షిత ప్రాంతాలకు మంగళవారం తరలించారు. సముద్రంలో లంగర్లు వేసిన బోట్లను ట్రాక్టర్ సహాయంతో మెరక ప్రాంతానికి చేర్చారు. అలలు ఎగిసి పడటంతో సముద్రం కొంచెం ముందుకొచ్చింది. అలల తాకిడికి ఇసుక కోతకు గురైంది. వేటకు ఎవరూ వెళ్లవద్దని చాటింపు వేశారు. సముద్రంలో దూరంగా వేటాడుతున్న మత్స్యకారులు సమాచారం అందించడంతో బోట్లను తిప్పుకుని వచ్చారు. సముద్ర స్నానానికి వచ్చిన భక్తులను మెరైన్ పోలీసులు అదుపు చేశారు. లోతుకు వెళ్లకుండా ఒడ్డునే స్నానం చేసేలా చర్యలు తీసుకున్నారు.

అయ్యవారు రాక ఆరుబయట విద్యార్థులు

- ఉపాధ్యాయులు లేక పాఠశాల మూత
- ఆరు బయటే వేచి ఉన్న విద్యార్థులు



పాఠశాలకు తాళం వేసి ఉండటంతో బయట కూర్చున్న విద్యార్థులు

పుల్లలచెరువు: పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు ఆరు బయటే ఉండిపోవాల్సిన పరిస్థితి పుల్లలచెరువు మండలంలోని గాజులపాలెం పాఠశాలలో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఆ పాఠశాలకు ఏదో ఒక స్కూల్ నుంచి ఉపాధ్యాయులను డిప్యుటేషన్ వేస్తున్నారు. ఆక్రమంలో తెల్లగట్ల పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్ వేశారు. కానీ ఆ ఉపాధ్యాయుడు ఏమనుకున్నాడో ఏమో మంగళవారం పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై గ్రామస్తులు మాట్లాడుతూ దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయంపై ఎంఈవో ను వివరణ కోరగా ఈ విషయంపై సదురు ఉపాధ్యాయుడిని వివరణ తీసుకుని నోటీసు జారీ చేస్తామన్నారు. పాఠశాలకు ప్రతి రోజు ఉపాధ్యాయులను పంపి పాఠశాల తెరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

శాంప్-1 ప్రశ్న పత్రాలు నేరుగా ఇవ్వాలి

● యూటీఎఫ్ డిమాండ్

ఒంగోలు సిటీ: డిసెంబర్ 18, 19, 20వ తేదీల్లో ఉన్నత పాఠశాలల్లో నిర్వహించనున్న సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్లను ఉదయం, సాయంత్రం హెచ్ఎంలు గంట ముందుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తెచ్చుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడాన్ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు మంగళవారం ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రశ్న పత్రం లీకైతే అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో చాలా ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, అంత దూరం నుంచి పేపర్లు తీసుకెళ్లాలంటే భద్రతాపరమైన ఇబ్బంది కలుగుతుందన్నారు. కాబట్టి విద్యాశాఖ అధికారులే పోలీస్ ప్రొటెక్షన్‌తో నేరుగా పాఠశాలలకు పరీక్ష పేపర్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో లీకేజ్ జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు.

సాగర్ కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం



దర్శి: దర్శి–పొదిలి రోడ్డులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ఎన్ఎస్పీ కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం మంగళవారం లభ్యమైంది. సాగర్ కాలువలో తేలియాడుతూ ఉన్న మృతదేహం ఎవరిదనే విషయంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. మృతురాలికి సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుందని, మెడలో పసుపు రంగు తాడు, బంగారు తాళిబొట్టు, చెవికి బంగారు కమ్మలు, కాళ్లకు వెండి మెట్టెలు ఉన్నాయని, పూల డిజైన్ కలిగిన పాచి రంగు చీర, నలుపు జాకెట్ ధరించి ఉందని వివరించారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని దర్శి పోలీసులు కోరారు.

కారు వదిలేసి దొంగ పరార్



టంగుటూరు: హైదరాబాద్ మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి కారు దొంగతనం చేసి టంగుటూరు వద్ద పోలీసులకు దొరికిపోయాడు. అందిన సమాచారం మేరకు వివరాలు.. మేడిపల్లి పరిధిలో నిలిపి ఉంచిన కారును ఓ వ్యక్తి చోరీ చేసి, నంబర్ ప్లేట్ తొలగించాడు. జిల్లాలో గుండా చెన్నై వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జిల్లా పోలీసులను మేడిపల్లి నుంచి అప్రమత్తం చేయడంతో నిఘా ఉంచారు. పోలీసులను తప్పించుకుని వెళ్లడం సాధ్యపడదని గ్రహించిన సదరు దొంగ జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట వద్ద కారును వదిలేసి పరారయ్యాడు. కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు మేడిపల్లి ఖాకీలకు అప్పగించారు.

ధరల విలయం

పెరిగిన ధరలతో పూట గడవడమే గగనంగా ఉందని పేదల గగ్గోలు

● కేజీ ఉల్లిపాయలు రూ.80, వెల్లుల్లి రూ.440 ● కొండెక్కి కూర్చున్న కోడి గుడ్ల ధర ● మరిగించకుండానే మంట పుట్టిస్తున్న నూనెలు ● పామాయిల్ రూ.140, శనగ నూనె రూ.260

బేస్తవారిపేట:

ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర ధరలు బగ్గుమంటున్నాయి. సరుకులు కొనాలన్న ఆలోచన వస్తేనే జనానికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఆరేడు నెలల క్రితం స్థిరంగా ఉన్న ధరలు నానాటికీ పెరుగుతూ మంట పుట్టిస్తున్నాయి. కొండెక్కిన ధరలు దిగిరాకపోవడంతో సామాన్యుడి మీద పెనుభారమే పడుతోంది. సరైన పంటలు పండక రైతులు, కూలీలు, సంక్షేమ పథకాలు అందక పేద ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్న సమయంలో పెరిగిన వంటనూనె, తెల్లగడ్డలు, ఉల్లిగడ్డలు, కోడిగుడ్ల ధరలు మరింత కలవరపడేలా చేస్తున్నాయి. ఆరు నెలల క్రితం కేజీ వెల్లుల్లి రూ.200, ఉల్లిపాయలు రూ.30, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.115, పామాయిల్ రూ.95 ధర పలికాయి. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నిత్యావసరాల ధరలు అంతకంతకూ పెరుగుతూ పోతున్నాయి. ధరలను కట్టడి చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో పేదల జీవనం దుర్భరంగా మారింది.





'గుడ్లు' తేలేసేలా ధర

కోడిగుడ్ల ధర ఎన్నడూ లేని విధంగా పెరిగింది. రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు రూ.7.50కు విక్రయిస్తున్నారు. పది రోజుల క్రితం 30 గుడ్ల ట్రే ధర రూ.130 ఉండగా నేడు రూ.210 పలుకుతోంది. కూరగాయలతో పాటు కోడిగుడ్ల ధరలు కూడా కొండెక్కడంతో కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో ధరలు పెరిగిపోతున్నాయని మార్కెట్ వర్గాలు తెలుపుతున్నాయి. చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాల నుంచి జిల్లాకు కోడి గుడ్లు సరఫరా అవుతున్నాయి. ఆగస్టులో గుడ్డు ధర రూ.5.70 ఉండగా అది నేడు రూ.7.50కి చేరింది. బలవర్ధకమైన పౌష్టికాహారం కావడంతో ఎక్కువ శాతం మంది గుడ్డును ఉపయోగిస్తున్నారు. బేకరీ ఫుడ్స్, నూడిల్స్ స్టాల్స్, రెస్టారెంట్లలో గుడ్ల వినియోగం ఎక్కువగా ఉంది.

హాస్టల్ విద్యార్థులకు కష్టమే..

కోడిగుడ్ల ధరల అమాంతం కొండెక్కడంతో బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికే నెలల తరబడి బిల్లులు మంజూరు చేయకపోవడంతో అప్పులతో నెట్టుకొస్తున్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోందని వార్డెన్లు వాపోతున్నారు. అనుకూలమైన ధరలు ఉన్న సమయంలోనే చిన్నసైజ్ గుడ్లు విద్యార్థులకు అందించేవారు. నేడు అధిక ధర పలుకుతుండటంతో చిన్న గుడ్లు కూడా అందకుండా పోతాయేమోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

కొండ దిగనంటున్న ఉల్లి

ఉల్లిపాయ కోస్తే కాదు కొన్నప్పుడే వినియోగదారులకు కన్నీళ్లు రాలుతున్నాయి. కేజీ ఉల్లిపాయల ధర రూ.80కు చేరడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. అంతకంటే 5 రెట్లు అధికంగా వెల్లుల్లి ధర కిలో రూ.450 పలుకుతోంది. అన్ని రకాల కూరల్లో ఉల్లి, వెల్లుల్లి లేకపోతే రుచి ఉండదని, ఎంత ధర పలికినా కొనుగోలు చేయక తప్పడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

నూనెలు సలసల

ఆరు నెలల క్రితం పామాయిల్ రూ.95 కాగా ప్రస్తుతం రూ.140, సన్‌ఫ్లవర్ రూ.115 నుంచి రూ.150, వేరుశనగ రూ.160 నుంచి రూ.230కి చేరింది. వంట నూనెలపై కేంద్ర ప్రభుత్వం 20 శాతం అదనపు సుంకాన్ని విధించడంతో ధరలు పైకి ఎగసిపడుతున్నాయి. శుద్ధి చేసిన వంట నూనెలపై గతంలో ఉన్న 12.5 శాతం సుంకాన్ని కేంద్రం 32.5 శాతానికి పెంచేయడంతో లీటరుపై రూ.35 నుంచి రూ.50 వరకు ధర పెరిగింది. ఆ భారమంతా వినియోగదారుల నెత్తిన పడింది.

సర్పంచ్‌లకు గౌరవమేదీ?

పొదిలి రూరల్: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల గౌరవాన్ని అధికారులు కాలరాస్తున్నారు. గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌లకు కూటమి ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంగళవారం పొదిలి మండలంలోని అక్కచెరువు, ఓబులక్కపల్లి గ్రామాల్లో సంఘటనే అందుకు నిదర్శనం. ఆయా గ్రామాల్లో గోకులం, ఫారం పాండ్, సీసీ రోడ్ల పనులను పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారి శివప్రసాద్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీహర్ష, ఏపీడీ లలిత కుమారి పరిశీలించారు. ఓబులక్కపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. అయితే ఇంత మంది జిల్లా అధికారులు రెండు గ్రామాలకు వస్తున్న విషయాన్ని ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, ఏపీఓ ఎవరూ కూడా సర్పంచ్‌లకు తెలియజేయలేదు. ఓబులక్కపల్లి, అక్కచెరువు సర్పంచ్‌లు ఆవుల వెంకట సుబ్బారెడ్డి, చేరెడ్డి నాగలక్ష్మి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడం వల్లే వారికి సమాచారం ఇవ్వకుండా కూటమి నేతలు ఒత్తిడి చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఓబులక్కపల్లిలో ఉపాధి హామీపై ప్రజలతో ముఖాముఖికి స్పందన కరువైంది. కేవలం ఐదుగురు గ్రామస్తులే ముఖాముఖికి హాజరుకావడంతో మొక్కుబడి తంతుగా సాగింది.



ఓబులక్కపల్లిలో ముఖాముఖికి హాజరైన ఐదుగురు స్థానికులు

జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఎస్కే మాబు

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు

ఒంగోలు టౌన్: జిల్లా అభివృద్ధిపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు విమర్శించారు. మంగళవారం ఒంగోలులోని సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చీమకుర్తి మహాసభల తీర్మానాలను వివరించారు. సీపీఎం సుదీర్ఘ పోరాటాలతో దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లాను వెనకబడినదిగా గుర్తించినప్పటికీ అందుకు తగిన విధంగా నిధులు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు అవసరం కాగా కనీసం రూ.50 కోట్లు కూడా కేటాయించలేదన్నారు. జిల్లాలోని నీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, కొత్త పరిశ్రమలొస్తే నిరుద్యోగ సమస్య కొంత మేర తీరుతుందన్నారు. కొత్తగా మరిన్ని ప్రాంతాలకు రైల్వే సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు రూ.6 వేల కోట్లు ఖర్చు పెట్టారని, ఇంకా రూ.4 వేల కోట్లు విడుదల చేయడంతోపాటు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం సరికాదని, విద్యుత్ సర్దుబాటు పేరుతో కూటమి ప్రభుత్వం మరో రూ.9500 కోట్లు వసూలు చేసేందుకు సిద్ధం కావడం దారుణమన్నారు. విద్యుత్ కంపెనీలను ప్రైవేట్ పరం చేసేందుకు చంద్రబాబు వేస్తున్న ఎత్తులను ప్రజలతో కలిసి తిప్పికొడతామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌డీ హనీఫ్ మాట్లాడుతూ.. సమస్యలపై పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదని పార్టీ నేతల జీవీ కొండారెడ్డి విమర్శించారు. అంకెల గారడీతో ప్రజలను మభ్య పెట్టి మాయ చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అంతు చూడాల్సిందే..

● రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణే సవాల్
● మైనర్ల డ్రైవింగ్‌పై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇద్దాం
● చోరీలను అరికట్టి, సొత్తు రికవరీని పెంచాలి
● పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ దామోదర్



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్:

మైనర్లకు వాహనాలు అప్పగిస్తున్న తలిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. సవాల్‌గా పరిణమించిన రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు గటి చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాను విశ్లేషించి, ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలు, పొగమంచు పడే సమయంలో వాహనదారుల భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీఎస్టీ అట్రాసిటీ, మహిళలకు సంబంధించిన కేసులు, మిస్సింగ్ కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసుల స్థితిగతులపై ఆరా తీశారు. గంజాయి తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలు, సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. నివాసాలు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని చెప్పారు. గస్తీ పెంచి, చోరీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేయడంతోపాటు రికవరీ శాతాన్ని పెంచాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తుల స్థితిగతులను పరిశీలించాలని, జైల్ రిలీజ్‌డ్ మానిటరింగ్ ద్వారా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. సత్ప్రవర్తన కలిగిన వారి షీట్ లిస్టవుట్ చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పోలీసు స్టేషన్ల వారిగా పెండింగ్ కేసులను తగ్గించుకోవాలని, వీటినైనంత త్వరగా పరిష్కార దశకు తీసుకొని రావాలని, దర్యాప్తు పూర్తయిన కేసుల్లో ఆలస్యం లేకుండా చార్జిషీట్లు వేయాలని సూచించారు. పోక్సో, రేప్ కేసుల్లో దర్యాప్తు వేగం పెంచాలని, మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహన చలానాల తాలూకు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నైపుణ్యం పెంచుకోవాలని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, పోక్సో, హత్య కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా, లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఎస్బీ డీఎస్పీ సురేష్ బాబు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, యు.నాగరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ కేసుల్లో ప్రతిభ చూపిన పోలీసులతో ఎస్పీ

వీఓఏల అక్రమ తొలగింపుపై హైకోర్టు స్టే

● కోర్టు ఆర్డర్ కాపీ తీసుకునేందుకు ఏపీఎం నిరాకరణ



ఏపీఎంతో మాట్లాడుతున్న ఎంపీపీ, బాధిత వీఓఏలు

బేస్తవారిపేట: నిబంధనలకు విరుద్ధంగా వీఓఏలను తొలగించడంపై హైకోర్టు స్టే ఇచ్చినట్లు ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి మంగళవారం తెలిపారు. బేస్తవారిపేట మండలంలోని కోనపల్లె, ఎంపీ చెరువు, ఖాజీపురం, వంగపాడు, పిటికాయగుళ్ల, బసినేపల్లెకు చెందిన వీఓలను అక్రమంగా తొలగించడంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా.. వీఓఏలకు అనుకూలంగా న్యాయస్థానం స్టేటస్ కో ఇచ్చింది. కోర్టు ఆర్డర్ కాపీని బాధిత వీఓఏలతో కలిసి వెలుగు ఏపీఎంకు ఇచ్చేందుకు ఎంపీపీ ప్రయత్నం చేశారు. తాము నేరుగా తీసుకోమని, ఉన్నతాధికారులు చెబితేనే తీసుకుంటామని ఏపీఎం మొండికేయడంతో.. ఉన్నతాధికారులతోనూ ఎంపీపీ మాట్లాడారు. అయినప్పటికీ కోర్టు ఆర్డర్ కాపీలను తీసుకునేందుకు ఏపీఎం నిరాకరించారు. ఆఫీస్ ఇన్‌వార్డు(ప్రజా ఫిర్యాదుల)లో ఇస్తామని ఎంపీపీ తెలియజేయగా.. 'మా కార్యాలయంలో ఇన్‌వార్డు లేదు, మేము ఎటువంటి రిజిస్టర్ మెయింటెన్ చేయడం లేదు, కోర్టు నుంచి రిజిస్టర్ పోస్టులో వస్తేనే తీసుకుంటాం' అంటూ వెలుగు ఏపీఎంతోపాటు సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కోర్టు ఉత్తర్వులనే ధిక్కరించే స్థాయిలో అధికారులు వ్యవహరించడంపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు.

ఇద్దరు మహిళలపై గొడ్డలితో దాడి





చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి, రమాదేవి

కొమరోలు:

పొలం వివాదంలో తోడికోడళ్లపై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. ఈ సంఘటన కొమరోలు మండలంలోని అల్లినగరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చప్పర్ల పకీరయ్య, అదే గ్రామానికి చెందిన తోడికోడళ్లు కత్తెరగళ్ల లక్ష్మీదేవి, కత్తెరగళ్ల రమాదేవి కుటుంబాల మధ్య కొద్దిరోజులుగా పొలం విషయంలో వివాదం నడుస్తోంది. పలుమార్లు పెద్దల వద్ద పంచాయితీ చేశారు. కాగా మంగళవారం వ్యవసాయ పనులు చేసేందుకు పొలానికి వెళ్లిన లక్ష్మీదేవి, రమాదేవిపై పకీరయ్య, తన కుమారుడు సాయి గొడ్డలితో దాడి చేశారు. తోడికోడళ్లకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

వరికోత యంత్రం బోల్తా

కంభం: వరికోత యంత్రం అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తాపడిన సంఘటన మంగళవారం జంగంగుంట్ల సమీపంలో అనంతపురం–అమరావతి హైవేపై చోటు చేసుకుంది. వివరాలు.. మార్కాపురం వైపు నుంచి కంభం వైపు వస్తున్న వరికోత యంత్రం జంగంగుంట్ల సమీపంలో పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. వాహనం బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా 108 వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు

పెద్దదోర్నాల: మోటారు సైకిల్‌ను ఎదురుగా వేగంగా వస్తున్న కారు ఢీకొనటంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం పెద్దదోర్నాల మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్‌లో చింతల సమీపంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై మహేష్ కథనం మేరకు.. శ్రీశైలం నుంచి దోర్నాల వైపు వస్తున్న కారు, శ్రీశైలం వైపు వెళ్తున్న మోటారుసైకిల్‌ను చింతల సమీపంలో ఢీకొనడంతో పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలేనికి చెందిన గుండుపల్లి శేషగిరి, షేక్ నాగూర్‌సాహెబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న శ్రీశైలం 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు స్థానిక వైద్యులు సిఫార్సు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రోన్‌తో మెరుగైన పోలీసింగ్



ఎస్పీకి డ్రోన్ బహుకరిస్తున్న డాక్టర్ గౌతమ్

ఒంగోలు టౌన్: డ్రోన్ కెమెరాలు ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్పీకి మార్కాపురానికి చెందిన కందుల ఓబుల్‌రెడ్డి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గౌతమ్ నాగిరెడ్డి డ్రోన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డ్రోన్ సాయంతో గస్తీని ముమ్మరం చేసే అవకాశం ఉంటుందన్నారు. దాతను అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) నాగేశ్వరరావు, మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, మార్కాపురం సీఐ సుబ్బారావు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.